మూడు నాణేలు

బొమ్మిడి అచ్చారావు

మోహన్ చాలాసేపు మాట్లాడలేదు.

"ఏమిటి మౌనం? ఆడదాని సంపాదన మీద బతకటం నీకు నామోషి అని చెప్పరాదూ?"

లలిత మాటలకు చివ్వున తలెత్తాడు మోహన్.

"నువ్వీ మాటలు నాలో కోపం తెప్పించాలనా, పౌరుషం తెప్పించాలనా, ఎందుకంటున్నావు?" అన్నాడు. అతని కంఠంలో బాధ తొణికిసలాడింది.

"కాకపోతే ఏమిటి, ఇంతసేపూ రాని నీ ఉద్యోగం గురించి బాధపడేకన్నా, ఉన్న నా ఉద్యోగం చూసి ధైర్యం తెచ్చుకొని సంతోషించరాదూ?"

"నాకు ఉద్యోగం లేకుండా, ఎందుకో, నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే ఏదోలా వుంది లలితా! నన్ను నేను సమాధాన పరుచుకోలేక పోతున్నాను."

"నువ్వేదో లేనిపోనివి ఊహించుకొని అనవసరంగా వర్రీ అవుతున్నావు. మా ఆఫీసరుకి చెప్పి ఏదైనా

వేకెన్సీస్ వున్నాయేమో కనుక్కోనా?"

"వద్దు, వద్దు. ఒకవేళ వున్నా అవి నాదాకా రావు. ఒకవేళ నీ మాటమీద నాకు ఉద్యోగం వచ్చినా, నలుగురు చాలా చులకనగా చూస్తారు, తేలిగ్గా మాట్లాడతారు-ఆడదానివల్ల ఉద్యోగం సంపాదించానని! అదింకా దుర్భరం!"

"చూడు, మోహన్! దీన్ని 'ఇన్ ఫీరియార్టీ కాంప్లెక్స్' అని ఇంగ్లీషులో ముద్దుగా పిలుస్తారు. నేను చెప్పిన సలహాకు నువ్వు ఏదో సాకు చూపిస్తున్నావు. నీకు బాధ కలిగించే విషయమైనా చెప్పేస్తున్నాను—నీకు ఆడదాని సంపాదన అంటే చాలా తేలిక భావం వుంది. అంటే ఆడదంటే నీ దృష్టిలో చాలా చులకన."

"నో నో అదేంకాదు లలీ! నన్నపార్థం చేసుకోకు. ఉద్యోగం సంపాదించాలనే తపన నాచేత అలా అని పిస్తోంది. నువ్వన్నా, నీ ఉద్యోగమన్నా నాకేమీ చిన్న చూపులేదు, నీకు వెనక పోషించాల్సినవాళ్ళు లేరు కాబట్టి నీ జీతం, నీ యిష్టం! కాని నాకింకా ఓ తల్లి, తమ్ముడు వున్నారు. వాళ్ళని పోషించాల్సిన బాధ్యత నామీదుంది. నీ జీతం మనిద్దరికీ వాడుకోవటానికయితే నాకిష్టమే! కాని వాళ్ళిద్దర్నీ నీ జీతంమీద పోషించాలంటే..ఆలోచించు. అందుకే నేను వెనుతీసేది."

లలిత కాసేపు మాట్లాడలేదు.

మోహన్ కూడా సీరియస్‌గా ఆలోచిస్తూ వుండి పోయాడు. అతని చేతులు యాంత్రికంగా గార్డెన్‌లోని గడ్డి మొక్కల్ని పీకేస్తున్నాయి. అన్యమనస్కంగా వున్నాడన్న విషయం అతని ప్రవర్తన సూచిస్తోంది.

"ఏమిటది? మొక్కలు పీకేస్తున్నావు, గార్డెన్

వాచ్ మెన్ చూస్తే నీతో తగాదా వేసుకొంటాడు!"
అన్న లలిత మాటలతో మోహన్ యీ లోకంలోకి వచ్చి తను చేసిన పనికి సిగ్గుపడ్డాడు.

చుట్టూ చూసుకొన్నాడు. చాలా సేపికి పారేశాడు. అతని దృష్టిని ఓ వస్తువు ఆకర్షించింది. చటుక్కున దాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. గుండ్రటి కాయిన్!

పైన మట్టి తుడిచాడు. బంగారు నాణెం.

ఆశ్చర్యంగా చూస్తోంది లలిత.

మోహన్ పరీక్షగా అటు యిటు తిప్పాడు. ఇండియా నాణెంకాదు. ఈజిప్టుది. దానిమీద సంవత్సరం చూసి యిద్దరు నోళ్ళు వెళ్ళబెట్టారు.

అది పదకొండో శతాబ్దం నాటిది! అప్పుడు ఈజిప్టుని పరిపాలించిన రాజు బొమ్మ ఓ పక్క, రెండో పక్క పిరమిడ్ చిహ్నం, దానికిందుగా సంవత్సరం ముద్రింపబడి వున్నాయి.

ముందుగా లలితే ఆశ్చర్యంనించి తేరుకొంది.

"ఇక్కడ యీ నాణేన్ని యెవరు పాతి పెట్టి వుంటారు?" అన్నది సాలోచనగా.

"పాతిపెట్టారో, పారేసుకొన్నారో! లేక ఎప్పుడో వర్షానికి కొట్టుకొనివచ్చి కప్పబడిపోయిందో?...."

"నో నో, ఇది ఎప్పుడో భూమిలో పూడుకుపోయిన నాణెం కాదు. ఈ మధ్యనే ఎవరో కావాలని పాతిపెట్టి వుండాలి!"

మోహన్ కళ్ళు పెద్దవయ్యాయి.

"ఎందుకలా అనుకొంటున్నావు?"

"వెరీ సింపుల్. కాయిన్ మీద అంటిన మట్టి చాలా తేలికగా జారిపోయింది. చాన్నాళ్ళ క్రితం పూడుకు

పోయివుంటే మట్టి బాగా కాయిన్‌కి పట్టేసి తోమితే గాని అసలు నాణెం రూపు కనిపించేది కాదు."

మోహన్ తలూపాడు.

"నంబర్ టూ మనచుట్టూ నేలంతా పచ్చికతో నిండి వుంది. నువ్వు మొక్కలు పీకినచోట పచ్చికలేదు. నేల గుల్లగా తవ్వినట్టుంది. ఈ మొక్కలు కావాలనే ఎవరో పాతిపెట్టారు, నేల తవ్వి. అందుకే యీ మొక్కలు పాతినంత మేరా గడ్డిలేదు."

మోహన్ క్షణామాత్రం ఊహించలేకపోయినందుకు మరోసారి సిగ్గుపడ్డాడు.

"అయితే, ఈ కాయిన్ ఎవరో కావాలనే ఇక్కడ పాతిపెట్టి వుండాలంటావు, అంతేనా?"

"ఖచ్చితంగా అంతే! ఎవరినుంచో సంగ్రహించబడి వుండాలి. దాన్ని కొన్నాళ్ళపాటు దాచిపెట్టాల్సిన అవసరం వచ్చి వుంటుంది. అందుకా వ్యక్తి యీ స్థలం ఎన్నుకొన్నాడు."

"ఇదంతా నీ అనుమానం కావచ్చు!"

"నిరాధారమయిన అనుమానం కాదు."

"అపరాధ పరిశోధన పత్రిక చదువుతావు కదూ! రీజనింగ్ బాగా అలవడింది."

"థాంక్యూ ఫర్ యువర్ కాంప్లిమెంట్!"

"అయితే యిప్పుడేం చెయ్యాలి?"

"బుద్ధిగా ఆ నాణెం మళ్ళీ యధాతధంగా పాతి పెట్టెయ్యటమే!"

"ఇంతటి అపురూపము, అలభ్యము అయిన నాణెం చేతులారా వదులుకోవాలా?

"నాణెం కోసం ప్రాణాలే వదులుకోవలసివస్తే...?"

ఉలిక్కిపడ్డాడు మోహన్.

"ఏమిటి నువ్వంటున్నది....?"

"ఇది అపురూపమైన నాణెం కాబట్టే యింత జాగ్రత్తగా, మనోకంట పడకుండా భూస్థాపితం చేయబడింది! అనుకోకుండా, యథాలాపంగా నువ్వు పిచ్చిమొక్కలు పీకుతుంటే, దానంతటది బయటపడింది. అది మనకంట బడలేదనుకొని పూడ్చిపెట్టేస్తే ఎవరికీ సమస్య వుండదు."

"అయామ్ సారీ లలీ! దీని విలువ రూపాయల్లో నాకు తెలీదుగాని, యిలాంటి అపురూపమైన నాణెం వదులుకో లేను. నా హాబీ నీకు తెలుసుగా. ఇలాంటివి సేకరించటం నాకెంతో యిష్టం."

"నా మాట విను మోహన్. ఆ నాణెం తాలూకు మనిషి వెయ్యికళ్ళతో దీన్ని కాపలా కాసుకొంటూ వుండొచ్చు. నా ఊహే నిజమయితే యిప్పుడు దీన్ని నువ్వు యిటికి తియ్యటం కూడా ఏ మూలనించో పరిశీలించినా ఆశ్చర్యపడనక్కర్లేదు. యింత విశాలమైన గార్డెన్‌లో యెవరెవరు ఏం చేస్తున్నారో యెవరు చూడొచ్చారు?"

మోహన్ తన వైఖరి మానలేదు.

లలిత బలవంతాన మోహన్ చేతిలోనించి నాణెంతీసి పాతిపెట్టేసి, పైన మొక్కలు సర్దేసింది మట్టి కప్పి.

మోహన్ ఇబ్బందిగా చూశాడు.

"పద, యింకో క్షణం ఇక్కడ వుండొద్దు. మనం ఈ సంగతి యీ స్పాట్‌లోనే మరిచిపోదాం. మరోసారి ఈ స్థలంలో కూచోవద్దు" తను లేస్తూ అతని చెయ్యిపట్టి లేపింది లలిత.

మోహన్ అయిష్టంగానే లేచి ఆమె వెంట గార్డెన్ బయటికి నడిచాడు.

"మన సమస్యకు సరైన పరిష్కారం దొరకటంలేదు. నువ్వు నా మాట వింటావని, మన్నిస్తావని ఆశిస్తున్నాను" అన్నది లలిత తన రూట్ సిటీబస్ ఎక్కుతూ.

మోహన్ మౌనంగా నిల్చుండిపోయాడు.

బస్ వెళ్ళిపోయింది.

మోహన్ చకచక గార్డెన్‌లోకి మళ్ళీ వచ్చాడు. కాయిన్ పాతిన స్పాట్‌కి వెళ్ళాడు. గబగబ మట్టిని తొలగించాడు.

లలిత పాతిన ముక్కలు ఎవరో పీకేసినట్టుంది. పక్కన చిందరవందరగా పడివున్నాయి. కంగారులో మోహన్ అది గమనించలేదు.

ఎంత లోతుగా వెతికినా కాయిన్ కనిపించలేదు. మళ్ళీ మట్టి బాగా వెళ్ళగించి చూశాడు.

నాణెం లేదు!

2

"నీకోసం ఎవరో వచ్చారబ్బాయ్!"

తల్లి మాటలకు లోపలినుండి బయటికి వచ్చాడు మోహన్.

బయట హాలు అని చెప్పబడే చిన్న గది వుంది అందులో ఎవరో అపరిచిత వ్యక్తి కూచుని వున్నాడు.

"మీరెవరో నేనెప్పుడూ చూసిన గుర్తులేదు" అన్నాడు మోహన్.

ఆ వ్యక్తి వంకరగా నవ్వాడు.

"నువ్వు నా మాట వింటే మిత్రులం, లేకుంటే శత్రులం అవుతాం మనం, నీకేది యిష్టం?" అన్నాడు.

మోహన్ తెల్లబోయి చూశాడు. లోపలికి తొంగి చూశాడు. తల్లి వంటగదిలో వున్నట్టుంది. తమ మాటలు వినే అవకాశంలేదు.

"మీరనేదేమిటో...."

మోహన్ మాటలు పూర్తికానేలేదు. ఆ అపరిచిత వ్యక్తి చేతిలో కత్తి తళుక్కుమంది.

"నువు మర్యాదస్తుడవనే నా నమ్మకం. నా మాట కాదన్నా, నన్ను మభ్యపెట్టాలని చూసినా ఈ కత్తి నీ గుండెల్లోకి దిగిపోతుంది" అతను మళ్ళీ నవ్వాడు.

మోహన్ అయోమయంగా చూశాడు.

ఇంతలో మోహన్ తల్లి రెండు కప్పుల్తో టీ తీసుకొని వచ్చి స్టూలుమీద పెట్టింది. అపరిచిత వ్యక్తి చేతిలో యిప్పుడు కత్తిలేదు.

మోహన్ తల్లి లోనికి వెళ్ళిపోయింది

అపరిచిత వ్యక్తి మోహన్ కళ్ళలోకి సూటిగా చూశాడు; "ఆ నాణెం యెక్కడ?" చలి పిడుగులాంటి ఆ మాటకి గతుక్కుమన్నాడు మోహన్.

"ఏ నాణెం?"

"నిన్న సాయంత్రం నువు పబ్లిక్ గార్డెన్ లో తవ్వి తీశావే, ఆ నాణెం—ఈజిప్టు కాయిన్."

"ఎవరన్నారు అది నేను తీశానని?"

అతను నవ్వాడు.

"మిష్టర్ నాకు వెయ్యి కళ్ళు. నేను స్వయంగా చూశాను. మట్టి పెళ్ళగించి ఆ కాయిన్ నువు తియ్యటం."

"మొదట నేను అనుకోకుండా ఆ కాయిన్ తీయటం జరిగింది. అయితే దాన్ని మళ్ళీ కప్పెట్టేశాం."

"అబద్ధం! నువ్వు, నీ ప్రియురాలు ఆ కాయిన్

గురించి చర్చించుకున్నారు. ఆమె కప్పిపెట్టెయ్యమంటే నువ్వు ఒప్పుకోలేదు. దాన్ని నీ దగ్గరే దాచుకున్నావు. ఆ తర్వాత మీరిద్దరు అక్కణ్నించి లేచివెళ్ళిపోయారు."

"నేను దాచుకోవాలనుకొన్న మాట నిజమే! కాని లలిత బలవంతాన నానుంచి లాక్కొని తనే స్వయంగా భూమిలో పూడ్చేసింది."

"కధ చెప్పకు. మీరిద్దరు గార్డెన్ బయటికి వెళ్ళగానే నేను వెంటనే అక్కడ కాయిన్ కోసం వెతికాను. ఖాళీ గొయ్యి నన్ను వెక్కిరించింది. అంతలోనే మరో వ్యక్తి దాన్ని కాజేశాడంటావా?"

"నిజంగా అంతే జరిగింది. నేను లలితని బస్ ఎక్కించి, ఆ కాయిన్ పట్ల మమకారం వదులుకోలేక మళ్ళీ గార్డెన్‌లోకి వచ్చి స్పాట్‌లో వెతికాను. అప్పటికే యెవరో మట్టి పెళ్ళగించి కాయిన్ తీసుకుపోయారు. మొక్కలు చుట్టూ చిందరవందరగా పడివున్నాయి."

"నేను నమ్మను. నేను వెతికేసరికే మొక్కలు పీకేసి వున్నాయి. మట్టి పెళ్ళగించి వుంది. నీకు నాకు మధ్య అంత తొందరగా, అంతి స్వల్ప వ్యవధిలో మరో వ్యక్తి ఆ కాయిన్ చేత చిక్కించుకున్నాడంటే నమ్మేటంత ఫూల్‌ని కాదు."

"నీకెలా నచ్చ చెప్పాలో అర్ధంకావటంలేదు. మేము కూచున్నది ఎవరూ కూచోని మరుగు ప్రదేశం. చుట్టూ పొదలు. ఆ పొదల చాటున మరో వ్యక్తి పొంచివుంటే కనిపించే అవకాశం లేనంత దట్టమైన పొదలవి. నువు మేం వెళ్ళేవరకు చూశావు కదా! ఈ లోపల, అంటే మేము అక్కణ్నించి లేచి బయటకు వచ్చేలోపల ఆ

సమీపంలోనే ఎవరైనా వ్యక్తికి యిది చూసి వుంటే, నీకు కూడా కనిపించకుండా ఆ కాయిన్ చేజిక్కించుకునే అవకాశముంది. అదే జరిగింది యీ విషయంలో."

"మిష్టర్! నన్నింకా నమ్మించాలని కట్టు కథ అల్లకు. నేను పసికట్టిన కోడ్డే తాచును. నాతో ఆటలు వద్దు. నీకు యిరవై నాలుగు గంటలు గడువిస్తున్నాను. ఈలోగా నాకా కాయిన్ కావాలి. దాని ఇప్పటి విలువ పన్నెండు గ్రాముల బంగారం కన్న ఎక్కువుండదు. అంటే దాదాపు రెండు వేలు. నీకు మరో వెయ్యి అదనంగా యిస్తాను. డబ్బు కోసమే నువ్వా కాయిన్ తీసుకొంటే, ఆ డబ్బు నే నిస్తాను. అది నాకు వెంటనే స్వాధీనం చెయ్యి."

మోహన్ కోపంగా చూశాడతని వంక.

"నేనెంత చెప్పినా వినుపించుకోవేం? నీ పాపిష్టి డబ్బు కోసం నేనాశపడను. పురాతన వస్తువులని సేకరించడం నా హాబీ. అందుకే ఆ కాయిన్ జాగ్రత్త పెడదామని సరదాపడ్డాను. లలిత వద్దంటే ఆమె మాట ప్రకారం పూడ్చెయ్యటానికి ఆమెకిచ్చాను. నా కళ్ళ ముందే దాన్ని పూడ్చి మొక్కలు పైన సర్దేసింది."

"ఆ కాయిన్ మీద ఆమె మోజుపడిందేమో! దాన్ని తనే తస్కరించి పూడ్చేసినట్టు నాటకమాడిందేమో?"

"ఛ ఛ! మరీ అంత నీచంగా మాట్లాడకు. ఆమెకు అలాంటి తక్కువ బుద్ధి ఏ కోశానా లేదు. ఆమె కాయిన్ మట్టిలో పూడ్చెయటం కళ్ళారా చూశాను."

"నీ మొండి వాదనతో నా టైం పాడుచేశావు. రేపు ఉదయం సరిగ్గా యిదే సమయానికి వస్తాను. కాయిన్ నా స్వాధీనం చేశావా సరే, లేకుంటే ఎల్లుండి

సూర్యోదయాన్ని చూడవు. వస్తాను."

అపరిచిత వ్యక్తి విషపుమాపు విసిరి వెళ్ళిపోయాడు.

మోహన్ చేష్టలుడిగి నిలబడిపోయాడు.

3

"వెల్‌కం బ్రదర్!" మనోహర్ చిన్నగా నవ్వాడు.

రహీం కోరగా చూశాడు.

"కాయిన్ చేజారిపోయింది. యెవడో కొట్టేశాడు."

మనోహర్ నిటారుగా కూచున్నాడు.

"ఏమిటి కొత్త కథ అల్లుతున్నావా?"

"నో నో, కథ కాదు. పబ్లిక్ గార్డెన్‌లో ఎవడికీ కనిపించని చోట దాచాను నిన్నరాత్రి చూడబోతే కాయిన్ లేదు."

"ఒకచోట పాతి మరోచోట వెదికావేమో, సరిగ్గా గుర్తుపెట్టుకున్నావా?"

"గుర్తే! పాతినచోట నేల సరిచేసి, క్రోటన్ మొక్కలు పాతాను. అవి యెవడో పీకేశాడు."

"ఐ.సీ. నువు పాతటం ఎవడైనా గమనించాడేమో?"

"ఎవరూ చూడని సమయంలో రాత్రి పదకొండుం న్నర ప్రాంతాల పాతాను. ఎప్పటికప్పుడు వెరిఫై చేసు కుంటూనే వున్నాను. క్రోటన్స్ కూడా బతికింది. దాదాపు నెలరోజులు ఎవరికీ కనపడకుండా రక్షించు కుంటూ వచ్చాను. నిన్న ఎవడిచేతిలోనో పడిపోయింది."

"చిత్రంగా వుందే! ఈ కాయిన్స్ గురించి తెలిసింది ముగ్గురికే! అందులో యిద్దరు మనం. మూడోవాడు సులేమాన్ కాయిన్‌తోబాటు మాయమయి నెలదాటింది. నా కాయిన్ యిదిగో భద్రంగా ఇక్కడ దాచాను"

మనోహర్ సీలింగ్ ఫాన్ నట్లు విప్పి మోటర్ డైప్లేటు

ఓపెన్ చేసి, కీచుగా అరిచాడు.

"అరె భాయ్, ఇందులో కాయిన్ మాయమయింది. యెవడో కొట్టేశాడు."

రహీం అనుమానంగా చూశాడు మనోహర్ వంక.

"నిజం భాయ్, నిన్న రాత్రి కూడా చూశాను. భద్రంగా వుంది. తెల్లారేసరికి ఎలా మాయమయిందో అర్థంకాదు."

"నమ్మమంటావా?"

"అబద్ధం చెప్పాల్సిన ఖర్మ నాకేముంది? నువ్వు చెప్పిన విషయం నేను నమ్మేనా లేదా! నమ్మకం లేనిది ఈ బిజినెస్ ఎలా చెయ్యగలం భాయ్!"

రహీం కణతలు రుద్దుకుంటూ దీర్ఘాలోచనలో పడిపోయాడు.

మనోహర్ బోనులో పెట్టిన పులిలా గదిలో పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ పచార్లు చేస్తున్నాడు.

"అయితే, యిది ఆ సులేమాన్ గాడి పనే అయి వుంటుంది. బేరం మన ముగ్గురి దగ్గరా వున్న మూడు నాణేలకు కుదిరింది. మూడు నాణేలు ఒక్కచోటు కలిసేనే దానికి నిర్ణయించిన ధర పలుకుతుంది. అవకాశం చూసి సులేమాన్ నీ నాణెం, నా నాణెం దొరకబుచ్చుకున్నాడు. ఈసరికి వాడు ఇండియా వదిలేసి వుంటాడు. ఒకటా, రెండా, ఇరవై లక్షలు! ఇరవై లక్షల బిజినెస్ వాడొక్కడి పరం అయిపోయింది."

"ఏం చెయ్యాలి? ఆ సులేమాన్ గాడి ఆచూకీ ఎలా తెలుస్తుంది? వాడ్ని ప్రాణాలతో వదలకూడదు."

"అసలు వాడు మన చేతికి దొరికితేనే కదా వాడి అంతు చూసేది? చేజారిపోయాడు."

"ఐడియా!" అరిచాడు రహీం.

"ఏమిటది?"

"మనతో బిజినెస్ టరమ్స్ కుదుర్చుకొన్న అరబ్ పార్టీని కల్సుకొంటే...."

"ఎలా కల్సుకోగలం? సౌదీ అరేబియా ఉన్న పళంగా ఎలా వెళ్తాం ఇప్పుడు?"

"వెళ్ళనక్కర్లేదు. ప్రతి శుక్రవారం సౌదీనుండి ఆ పార్టీ తాలూకు రిప్రజెంటేటివ్స్ వస్తుంటారు. వాళ్ళ నడిగితే అసలు సంగతి తెలిసిపోతుంది."

"గుడ్ అయిడియా!"

4

"వెరీగుడ్ జాన్సన్! మొత్తానికి సాధించుకొచ్చా వన్నమాట!" ప్రశంసగా చూశాడు ఫరూక్ అలీ.

జాన్సన్ గుంభనగా నవ్వాడు.

"రహీం, మనోహర్ వద్దనున్న కాయిన్స్ ఎలాగో సంపాదించగలిగాను. అసలైనవాడు సులేమాన్ ఎక్కడో మాయమయ్యాడు. అతని ఆచూకీ తెలిస్తేగాని, ఆ కాయిన్ చేజిక్కించుకోలేం. మూడూ కలిస్తేగాని ఇరవై లక్షలు మనకు చిక్కవు."

"కరెక్టే-కాని, ఆ సులేమాన్ ఏమయిపోయాడో, అసలు బతికున్నాడో లేదో ఎలా తెలుసుకోవటం?"

"మన మనుషులు వేటకుక్కల్లాంటి వాళ్ళు. ఇండియాలో ఏ మారుమూల దాగినా పట్టేస్తారు."

"వాడు ఇండియా వదిలేసి వుంటే?"

"మనది ఇంటర్నేషనల్ స్మగ్లింగ్! మన ఏజెంట్సుకి చెప్పివుంచామంటే సులేమాన్ని బతికుండగాగాని, శవంగాగాని పట్టేస్తారు."

"శవాన్ని మనమేం చేసుకుంటాం?"

"ఏవీ కాయిన్స్!?"

జాన్సన్ అందించాడు.

ఫరూక్ ఆనందంగా తలాడించాడు.

ఓ కాయిన్ పదో శతాబ్దాలనాటి ఈజిప్టు దేశానిది. రెండోది పదకొండో శతాబ్దం నాటిది ఈజిప్టుదే!

"తొమ్మిదో శతాబ్దం కాయిన్ సులేమాన్ దగ్గరుంది."

ఫరూక్ అలీ సాలోచనగా తలూపాడు.

"అదే అన్నిటికన్నా అపురూపమయినది. ఈ రెండూ వుండి అదిలేక విలువలేనివే! రెండు లక్షలు కూడా యెవరూ ఇవ్వరు."

"మూడింటికి ఇరవై లక్షలు ఆఫరుంది."

"అదే కదా, నా బాధ."

"పది లక్షలు నీకు రావాల్సి వున్నా, శ్రమకు ఫలితంగా రెండు లక్షలు నేను ఎక్స్ట్రా తీసుకొంటాను."

"కరక్టే! నీకు ఎలాంటి సాయం కావాలన్నా నేను సిద్ధంగా వున్నాను. ఎంత ఖర్చయినా సరే సులేమాన్ దగ్గర్నుంచి దాన్ని సాధించు."

"సాధించి తీరతాను. నా ప్రయత్నాలు కొనసాగిస్తాను, సులేమాన్ జాడ తెల్సుకోవటానికి మన ఏజెంట్సుకి వర్తమానాలు పంపించు" అన్నాడు జాన్సన్.

5

"ఇదిగో ఇవి హంతుని వివరాలు."

ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అందించిన ఫైలు తీసుకొని ఆమూలాగ్రం పరిశీలించాడు డిటెక్టివ్ కిరణ్.

"హంతుడి పేరు సులేమాన్. పురావస్తు ప్రదర్శనశాల

వాచ్‌మన్. రెండు నెలలుగా పరారీలో వున్నాడు. అతను పరారీ అయిన రోజే పురావస్తు ప్రదర్శనశాలలో భద్రపరచబడిన అమూల్యమైన బంగారు నాణెం మాయమయింది. అది ఈజిప్టు దేశం మనకు బహూకరించిన తొమ్మిదో శతాబ్దంనాటి ఈజిప్టు నాణెం. చిత్రంగా ఆ నాణెం మాయమయిన ఒకటి రెండు రోజుల తేడాలో బ్రిటన్ మ్యూజియంలోని పదో శతాబ్దంనాటి ఈజిప్టు నాణెం, న్యూయార్క్ మ్యూజియంలోని పదకొండో శతాబ్దంనాటి నాణెం మాయమయ్యాయి. ఇవిగో వాటి తాలూకు పేపర్ కటింగ్స్."

మరో ఫైలు కిరణ్ అందించాడు శ్రీనివాస్.

కిరణ్ వాటిని చదివి ఫైలు శ్రీనివాస్‌కి ఇచ్చేస్తూ, "అయితే ఈ మూడు నాణేలు ఈజిప్టువే కావటం, మూడూ రోజులు తేడాలో అపహరింపబడటం-ఇదంతా ప్లాన్డ్‌గా జరిగిందన్న విషయాన్ని రుజువుచేస్తున్నాయి. అంతేనా?" అన్నాడు.

"ఎగ్జాట్లీ. ఇవి చాలా అపురూపమైన నాణేలు. మ్యూజియంస్ ప్రతిష్ఠకి సంబంధించిన వ్యవహారం. అందుకే భారత ప్రభుత్వం దీని విషయమై చాలా శ్రద్ధ వహిస్తున్నది."

కిరణ్ తలూపాడు.

"బ్రిటన్, న్యూయార్క్, ఇండియా మూడు విభిన్న దేశాల ప్రదర్శనశాలలనించి ఒకే రకమైన చోరీ జరిగింది. అంటే, కచ్చితంగా ఈ మూడు చోరీలకు సంబంధముంది. ఒకే వ్యక్తివల్ల ఇవి జరగలేదు. ముగ్గురు చేసిన పని. అయితే ఆ ముగ్గురి వెనక ఇంకా ఎంతోమంది పాత్ర వుండొచ్చు."

"అవును."

"సులేమాన్ శవం దుస్తుల్లో ఏమయినా వివరాలు దొరికాయా?"

"అతని షర్టు ఇన్నర్ పాకెట్‌లో అతని ఐడెంటిటీ కార్డు, ఈ కాగితాలు దొరికాయి. దీన్నిబట్టే అతని శవాన్ని పోల్చగలిగాం."

శ్రీనివాస్ కార్డు, కాగితం అందించాడు.

కిరణ్ కార్డు పక్కన పెడుతూ, కాగితం వంక దీక్షగా చూశాడు.

అందులో ఓ పాడుబడ్డ మశీదు బొమ్మ గీయబడివుంది. మశీదుకి కుడిపక్క ఓ చెట్టు బొమ్మ దానికింద ఎనిమిది అంకె వేసివున్నాయి. ఎనిమిది అంకెకి దిగువ తొమ్మిది అంకె వేసివుంది.

"ఈ కాగితం ఈ కవర్లో పెట్టి వుంది. దీనిమీద ఏదో చిరునామా వుంది గాని, తడిసిపోయి చెరిగి పోయింది" శ్రీనివాస్ బాగా నలిగి, తడి ఆరిన కవరు ఇచ్చాడు కిరణ్‌కి.

కిరణ్ కవరు పరిశీలనగా చూశాడు. బ్రౌన్ రంగు కవరది. ఇంకు పెన్నుతో ఏవో అక్షరాలు గజిబిజిగా రాసివున్నాయి. చివర 'హైదరాబాదు' అన్న అక్షరాలు అతి కష్టంమీద గుర్తుపట్టాడు. అంటే ఈ కాగితాన్ని కవర్లో పెట్టి హైదరాబాదులోని యెవరికో పోస్టు చెయ్యాలని సులేమాన్ ఉద్దేశ్యమయి వుండాలి.

కవరు తిప్పి చూశాడు. పోస్టల్ స్టాంపు అంటించిన గుర్తు కనిపించింది. స్టాంపు తడికి నాని ఊడిపోయి వుండాలి!

"శవంహుస్సేన్ సాగర్ లో కనిపించిందన్నావుకదూ!"

"అవును. బాగా నాని ఉబ్బిపోయింది. ప్లాస్టిక్ కవర్ లో దాచినందువల్ల ఐడెంటిటీ కార్డు తడవలేదు. అందుకే శవాన్ని గుర్తుపట్టగలిగాం. విడిగా వుండటంవల్ల కవరు లోపలి కాగితం బాగా తడిసిపోయింది. బాల్ పాయింట్ పెన్నుతో గీసినందువల్ల మశీదు బొమ్మ సాంతం చెరిగిపోలేదు" అన్నాడు శ్రీనివాస్.

"సులేమాన్ ది ఏ ప్రాంతం?"

"ఏ ప్రాంతమో సరిగా చెప్పినవారు లేరు. చాలా ఏళ్ళక్రితమే ఇక్కడ హైదాబాద్ లో మ్యూజియంలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతనికి భార్యాపిల్లలు ఎవరూ లేరు. ఎవరో ఉంపుడుకత్తె వుందని తెలిసింది. బహుశా ఈ కవరు ఆమె పేరనే రాసి వుండొచ్చు."

"పురావస్తు ప్రదర్శనశాలలో అతని గురించి ఎంక్వయిరీ చేశావా?"

"ఎంక్వయిరీకి నేను వెళ్ళేసమయానికి క్యూరేటర్ సెలవుమీద వున్నాడు. ఈ పన్నెండో తేదీకి వస్తారని విన్నాను. ఇన్ ఛార్జిని అడిగితే పూర్తి వివరాలు క్యూరేటర్ గార్ని కలిసి మాట్లాడమని చెప్పాడు."

"అయితే, యింకా రెండు రోజుల తర్వాతగాని క్యూరేటర్ తిరిగిరాడు. ఆయన వస్తేగాని కేసుకి పూర్తి రూపం రాదు."

"కేసు ఇంకా ప్రాథమిక దశలోనే వుంది. అయితే దేశంలో సంచలనం కలిగించిన నాణెం చోరీకి సంబంధించిన అతిముఖ్యమైన వ్యక్తి దొరకటంతో—అందునా శవరూపాన — మా డిపార్టుమెంటుకి చేతినిండా పని తగిలింది. ప్రత్యేకం, స్థానిక క్రైంబ్రాంచ్ ఇన్స్పెక్టర్ని కావటంతో, నాకే అప్పచెప్పారు ఈ కేసు. అందుకే

నిన్ను వెంటనే రప్పించాను."

కిరణ్ మందహాసం చేశాడు.

"హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయి రాగానే తగిలిన గడ్డు కేసు ఇదేననుకుంటాను."

"అదే బ్రదర్, నా బాధాను. యింకా ఓ పక్క ఇక్కడ సెటిల్ కాలేదు. ఇంతలోనే పెద్ద కేసు. ఇది ఒక్కరికి సంబంధించిన వ్యవహారం కాదు, భారత దేశ ప్రతిష్ఠకి సంబంధించినది. అందుకే దీన్నెలా గట్టెక్కాలోనని నాకు ఓ పక్క భయంగా వుంది. నువ్వు వచ్చావు, నాకు కొండంత ధైర్యం."

"డోంట్ వర్రీ మైడియర్ ఇన్స్‌పెక్టర్! నేను కూడా ఇది ప్రతిష్ఠాకరమైన కేసుగానే తీసుకుంటున్నాను. నేనూ భారతీయుడ్నే కదా!"

ఇంతలో ఓ పాతికేళ్ళ యువతి లోపలికి అడుగుపెట్టి శ్రీనివాస్‌ని విష్ చేసింది.

కిరణ్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఈమె పేరు లలిత. ఇక్కడే ఎ. జి. ఆఫీసులో పనిచేస్తోన్నారు. వీరు ప్రఖ్యాత డిటెక్టివ్ కిరణ్" పరిచయం చేశాడు శ్రీనివాస్.

లలిత విస్ఫారిత నేత్రాలతో కిరణ్ వంక చూసింది.

"చాలా సంతోషం సార్! మీ గురించి వినడమేగాని చూసే అదృష్టం కలగలేదింతవరకు. ఈ రోజు సుదినం."

మందహాసం చేశాడు కిరణ్.

"మోహన్‌గారి ఆచూకీ ఇంకా తెలియలేదమ్మా! దర్యాప్తు చేస్తున్నాం" అన్నాడు శ్రీనివాస్.

లలిత ఏదో చెప్పేంతలో శ్రీనివాస్, కిరణ్ వంక తిరిగి, "ఈమె ఫ్రెండు మోహన్ నాలుగు రోజులుగా

కనిపించటంలేదని స్టేషన్‌లో రిపోర్టిచ్చారు. అయితే, అతనికేదైనా అపకారం జరిగివుండొచ్చని అనుమానిస్తున్నట్టు రిపోర్టులో సూచించారు. అది మన క్రైం బ్రాంచ్‌కి రిఫర్ చేశారు" అన్నాడు.

"అనుమానించడానికి కారణం?" అడిగాడు కిరణ్.

"ఇదివరకోసారి ఎవరో వచ్చి తనను చంపుతానని బెదిరించినట్టు మోహన్ లలితగారికి చెప్పాడట. కారణం ఈమెకు చెప్పలేదట. ఆ మర్నాటినుంచే మోహన్ కనిపించటంలేదని రిపోర్టిచ్చారు."

కిరణ్ లలితవంక తిరిగి, "మీరు మోహన్‌కి బంధువులా, స్నేహితులా?" అనడిగాడు.

లలిత కొద్దిగా సిగ్గుపడి, "మేమిద్దరం వివాహం చేసుకోవాలనుకున్నామండి. అయితే తనకి ఉద్యోగం అవలేదు. ఉద్యోగం దొరికేవరకు పెళ్ళి వాయిదా వేసుకుంటూ వచ్చారు. నాకున్న ఉద్యోగంతో సరిపెట్టుకుందామన్నా ఆయన వినలేదు, అంతలోనే ఇలా జరిగింది" అన్నది.

"ఏదైనా ఉద్యోగాన్వేషణలో వెళ్ళారేమో?"

"నాకు చెప్పకుండా ఆయన ఎక్కడికీ వెళ్ళరండి. ఒక రోజు రెండు రోజులయితే చెప్పకపోవచ్చుగాని, ఇన్నాళ్ళు వెళ్ళాల్సిన పనయితే తప్పక చెప్పేవారు. అదీగాక హైదరాబాద్‌కన్న ఉద్యోగం దొరికే పట్టణంగాని నగరంగాని ఆంధ్రాలో ఎక్కడున్నాయండి?"

"యూ ఆర్ రైట్! చెప్పకూడని పరిస్థితిలోగాని, చెప్పరాని విషయమైగాని ఆయన వెళ్ళివుంటే....?"

"నో నో. అంత చెప్పకూడని రహస్యాలు మా మధ్య ఏవీ లేవండి."

"ఆయనకు బాంధవ్యతలేమైనా వున్నాయా?"

"ఓ తమ్ముడు, తల్లి వున్నారండి. ఇక్కడ వాళ్ళకు స్వంత ఇల్లుందండి. ఓ పోర్షన్ అద్దెకిచ్చారు. అదే ప్రస్తుతం జీవనాధారం. తమ్ముడి చదువు త్వరలో పూర్తి కాబోతుంది. ఆడపిల్లలెవరూ లేరు."

కిరణ్ ఓ నిమిషం మౌనం వహించాడు.

"మీరు ఆయన తరచు కలుసుకుంటారా?"

"కల్సుకుంటామండి దాదాపు ప్రతిరోజు."

"మరి యీ మధ్య వారం—పదిరోజులుగా ఏమైనా అనుమానించదగ్గ పరిస్థితులేమైనా ఎదురయ్యాయా? ఐ మీన్ మిమ్మల్ని యెవరైనా వెంబడించటంగాని, మోహన్‌తో ఎవరైనా ఘర్షణపడటంగాని—అలాంటిది ఏమైనా...."

"అదేం లేదండి. అలాంటిది నా పరోక్షంలో జరిగినా మోహన్ నాతో తప్పక చెప్పివుండేవాడు."

కిరణ్ రెండు క్షణాలు మౌనం వహించాడు.

లలిత ఏదో గుర్తువచ్చినదానిలా తలెగరేసింది.

"మీరు అడుగుతుంటే గుర్తువచ్చింది. వారం రోజుల క్రితం పబ్లిక్ గార్డెన్స్‌లో మాకో బంగారు నాణెం దొరికింది."

వింటున్న శ్రోతలిద్దరు ఉలిక్కిపడ్డారు.

"ఈజిప్టు నాణెమా?" శ్రీనివాస్ ఆత్రుతగా అడిగాడు.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది లలిత.

"తెలుసులెండి. తొమ్మిదో శతాబ్దంనాటిది. ఈజిప్టు రాజు బొమ్మ ఓ పక్క, పిరమిడ్స్ వెనకపక్క వున్నాయి, అవునా?"

"మీరు చెప్పినదాంట్లో రెండో భాగం రైటే! కాని ఆ నాణెం పదకొండో శతాబ్దంనాటిది. దానిమీద సంవత్సరం ముద్రింపబడివుంది."

శ్రీనివాస్ కొంత నిరుత్సాహపడ్డాడు.

"మీరు సంవత్సరం సరిగానే చూశారు కదా!"

"చాలా స్పష్టంగా చూశామండి. దాని మీద మా ఇద్దరికీ కొంత సేపు వాదన కూడా జరిగింది."

"యూ ఆర్ రైట్! మిష్టర్ శ్రీనివాస్, ఆ నాణెం న్యూయార్క్ మ్యూజియంనించి అపహరింపబడినది!"

శ్రీనివాస్ ఏదో అడగబోతుండగా వారించి, కిరణ్ లలితని అడిగాడు. "చెప్పండి, ఆ తర్వాత ఏం జరిగింది?"

"మోహన్ ఆ నాణేన్ని భద్రపరుస్తానన్నాడు. నేను వద్దన్నాను. అది యెవరో కావాలని అక్కడ పాతి పెట్టినట్టు గ్రహించాను. అది పాతినచోట పచ్చిక మొలవలేదు. నేల గుల్లగా వుంది. మట్టి కప్పి క్రోటన్స్ మొక్కలు కొత్తగా పాతిపెట్టారు. అవి చిగురించి వున్నాయి. దాన్ని వెంట తెచ్చుకోవటమంటే, కష్టాల్ని కోరి తెచ్చుకోవటమేనని హెచ్చరించాను. మోహన్ దానిమీది వ్యామోహం వదులుకోలేక పోతుంటే నేనే దాన్ని లాక్కుని మళ్ళీ భూస్థాపితం చేసేశాను."

"ఆ తర్వాత మళ్ళీ ఆ నాణెం విషయం ప్రస్తావన కొచ్చిందా?"

"లేదు. ఆ తర్వాత, అదే రోజున యెవరో వ్యక్తి తన ఇంటికే వచ్చి తనని బెదిరించాడని మోహన్ చెప్పాడు. ఎందుకని అడిగితే చెప్పలేదు. నేను రెట్టించ లేదు. జాగ్రత్తగా వుండమని సలహా ఇచ్చాను. మర్నాడు మోహన్ కనిపించకుండా పోయిన రోజు రాత్రి

మోహన్ గదినంతా యెవరో చిందరవందరగా చేసి దేని కోసమో వెతికిపోయాడని, ఏ దొంగోడో అయుండాలని మోహన్ తల్లి నాకు చెప్పింది."

కిరణ్ శ్రీనివాస్ వంక తిరిగి, "ఈమెతో ఓసారి మనం పబ్లిక్ గార్డెన్సుకి వెళ్ళి ఆ నాణెం పాతిన స్థలం వెరిఫై చెయ్యాలి" అన్నాడు.

శ్రీనివాస్ తలూపాడు.

6

"ఇదిగోనండి, ఇక్కడే మేం ఆ కాయిన్ చూసి పాతేశాం" లలిత చూపించిన స్థలంలో పరిశీలనగా దృష్టి నిలిపి చూశారు—కిరణ్, శ్రీనివాస్.

అది పబ్లిక్ గార్డెన్సు చివరిగేటు దగ్గరున్న లాన్స్. అందులో మళ్ళీ ఆ స్థలం చాలా మరుగ్గా వుంది. చుట్టూ దట్టమైన పొదలు, క్రోటన్స్ మొక్కలు, ఎర్రటి పచ్చటి పూల మొక్కలు. వాళ్ళకి బయటివాళ్ళు కనిపించక పోవచ్చుగాని, వాళ్ళు చేసేపని పరీక్షగా చూస్తే ఎత్తున గట్టుమీదున్న వాళ్ళకు కనిపిస్తుంది.

కిరణ్ ఎత్తయిన ప్రదేశంమీదికి వచ్చాడు. అక్కడ గార్డెన్ కోసం నీళ్ళు స్టాకుచేసే సిమెంటు టాంకు లున్నాయి. అక్కడినుంచి చూస్తే ఆ నాణెం పాతిన స్థలం కనిపిస్తోంది.

కిరణ్ మళ్ళీ స్పాట్‌కొచ్చి చుట్టూ చూశాడు. మోహన్, లలిత కూచున్న చోటికి ఎడమ పక్కగా గుబురుగా వున్న పొద దగ్గిర గడ్డి బాగా నలిగివుంది.

కిరణ్ మోకాళ్ళమీద వంగి చూశాడు—గడ్డిలో రెండు మూడు సిగరెట్ పీకలు కనిపించాయి. కర్చీఫ్‌తో వాటిని పట్టి జేబులోనించి ఓ కాగితంతీసి దానిలో

వేశాడు.

శ్రీనివాస్ ప్రశ్నార్థంగా చూశాడు.

అవి 'డంకన్స్' బ్రాండ్ సిగరెట్లు, రాయల్ సిగరెట్లు.

"ఇవి న్యూయార్క్‌లో దొరికే సిగరెట్స్. బహుశా ఆ కాయిన్ చేజిక్కించుకున్న వ్యక్తి ఇక్కడే చాలా సేపు వెయిట్ చేసి వుంటాడు. మోహన్, లలిత కాయిన్ పుడ్చి వెళ్ళిన మరుక్షణం ఆ వ్యక్తి దాన్ని వెతికి తీసి పట్టుకుపోయాడు. మోహన్‌ని బెదిరించిన వ్యక్తి అది గమనించి వుండడు. మోహన్, ఆ వ్యక్తి కూడా లేని కాయిన్ కోసం అక్కడ వెతికారు. ఒకరు వెతికినట్టు మరొకరికి తెలీదు. ఆ వ్యక్తి మోహనే ఆ కాయిన్ పట్టుకుపోయాడని భావించి ఆతన్ని బెదిరించి వెంట పడి వేధించాడు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తలూపాడు.

"ఇక మీరు వెళ్ళిరండి లలితగారూ!" అన్నాడు కిరణ్.

లలిత వెళ్ళిపోయాక, "మిష్టర్ శ్రీనివాస్! మనం పురావస్తు ప్రదర్శనశాలకు వెళ్ళాలి!" అన్నాడు కిరణ్.

"ఇంకా క్యూరేటర్ సెలవునించి తిరిగిరారను కుంటాను."

"సులేమాన్ కొలీగ్స్‌నుంచి కొంత సమాచారం రాబట్టాలి. క్యూరేటర్‌తో పెద్ద పనుండకపోవచ్చు."

ఆర్కిలాజికల్ మ్యూజియంవద్ద జీపు దిగారిద్దరు.

7

మ్యూజియం యిన్‌ఛార్జి సాదారంగా ఆహ్వానించాడు.

"సులేమాన్ హత్య విషయంలో కొంత ఇన్ఫర్మేషన్

కావాల్సి వచ్చాం" అన్నాడు కిరణ్.

"ఇది వరకు ఇన్స్పెక్టర్ గారికి మనవిచేశాను—మా క్యూరేటర్ లేరండి."

"ఆయన లేకపోయినా ఫరవాలేదు. ఒకటి రెండు విషయాలు మీరు చెప్పగలిగినవే అడగాలని వచ్చాం."

"అడగండి."

"సులేమాన్ ఇక్కడ ఎన్నాళ్ళుగా పనిచేస్తున్నాడు?"

"దాదాపు పన్నెండేళ్ళుగా చేస్తున్నాడండి. మనిషి నమ్మకస్తుడే!"

"సులేమాన్ కనిపించకుండా పోయి ఎన్నాళ్ళయింది?"

"రెండు నెలలవుతుందండి."

"అతను పారిపోయాకనే నాణెం కనిపించలేదు. అవునా?"

"అవునండి. ప్రతిరోజూ మ్యూజియం మూసేవేళకు క్యూరేటర్ గారు, నేను, మరో ఇద్దరు బాధ్యతగల ఆఫీసర్లు స్టోర్ తాళాలు పరీక్ష చేస్తుంటామండి. స్టోర్ కి సాధారణంగా గేటు వేసి వుంటుంది. అది కరెక్టుగా వుంటుందో లేదో పరీక్ష చేస్తూంటాం.

సులేమాన్ పారిపోయిన మర్నాడు అంటే ఆగష్టు పదమూడో తేదీన పురాతన నాణేలున్న స్టోర్ తో పని వచ్చింది. ఎందుకంటే అరబ్ నించి కొంతమంది ముఖ్య అతిథులు మన రాష్ట్రానికి వచ్చారు. సందర్శనార్థం మ్యూజియంకి వచ్చారు. వారు మ్యూజియంలోని పురాతన నాణేలు, యీజిప్షియన్ మమ్మీని చూడాలని కోరారు.

మేడమీదున్న మమ్మీని చూశాక నాణెల స్టోర్ ని

క్యూరేటర్ గారు మా అందరి సమక్షంలోనూ తెరిచి చూశారు. అయితే నాణేలున్న కేస్‌లో అన్ని నాణే లున్నాయిగాని, తొమ్మిదో శతాబ్దంనాటి ఈజిప్టు నాణెం లేదు. స్టోర్‌కి వేసిన సీలు వేసినట్టే వుంది. నాణెం ఎలా మాయమయిందో మాకర్థం కాలేదు."

"సులేమాన్‌ని మీరు చివరిసారిగా యెప్పుడు చూశారు?"

"పదకొండో తేదీ ఉదయం."

"మరి పన్నెండో తేదీన చూడలేదా?"

"పన్నెండో తేదీ జన్మాష్టమి సందర్భంగా మ్యూజియంకి సెలవు. పన్నెండో తేదీ టర్న్ డ్యూటీ సులేమాన్ కేపడింది. చోరీ పన్నెండో తేదీనే జరిగుండాలి."

"అయితే మీరు సులేమాన్ దొంగిలించాడని ఎందుకనుకున్నారు?"

"అతనే డ్యూటీకి హాజరు కాలేదు పదమూడో తేదీన. తక్కిన అందరూ వచ్చారు. పదమూడో తేదీ ఉదయం వాచ్‌మన్‌కి అతను కనిపించి, అతనొచ్చాక డ్యూటీనుంచి దిగవలసింది! కాని అతను వాచ్‌మన్‌కి పదమూడు ఉదయం కనపడలేదు."

"వెంటనే ఆతని గురించి రిపోర్టిచ్చారా పోలీసులకి?"

"లేదండి. ఎందుకంటే ఈ మహానగరంలో డ్యూటీకి రాలేకపోవటానికి ఎన్నో కారణాలుండవచ్చు. అంచేత ఒకటి రెండు రోజులు చూశాకగాని ఆ వ్యక్తి డ్యూటీకి అబ్‌స్కాండ్ అయినట్టు పరిగణించం."

"పధ్నాలుగున రిపోర్టివ్వలేదు, కారణం? అప్పటికి రెండురోజులయిపోయిందిగా సులేమాన్ మాయమయి!"

"పధ్నాలుగు, పదిహేను తేదీలు సెలవు దినాలు—రెండవ శనివారం, ఆగష్టు పదిహేను సందర్భంగా. అంచేత పదహారో తేదీన రిపోర్టిచ్చాం పోలీసులకి."

"అంటే సులేమాన్ గురించా, చోరీ గురించా?"

"చోరీ గురించి పదమూడో తేదీన వెంటనే రిపోర్టు ఇచ్చాం. సులేమాన్ గురించి పదహారుని రిపోర్టిచ్చాం—చోరీకి, అతని అంతర్థానికి సంబంధముంటుందని వూహించి."

"సులేమాన్‌కి భార్యాబిడ్డలు, బంధువులు వున్నారా?"

"అతను ఎందుకో పెళ్ళిచేసుకోలేదండి, వెనక ముందు ఎవరూ లేరనుకుంటాను. అయితే ప్రతి నెలా కర్నూల్‌లో వున్న తల్లికి వందరూపాయలు తన జీతంనించి పంపిస్తూండేవాడు" అన్నాడు ఇన్‌ఛార్జి.

"పదకొండో తేదీనగాని, అంతక్రితం ఒకటి రెండు రోజుల ముందుగాని కాయిన్స్ వున్న స్టోర్ ఏ కారణం చేతనైనా తెరవటం జరిగిందా?"

"సాధారణంగా బంగారంలాంటి విలువైన వస్తువులు, అపురూపమైన మాన్యుమెంట్సు — డిస్టింగ్విషెడ్ విజిటర్సు (ముఖ్య అతిధులు)కి తప్ప ప్రదర్శించమండి. ఏడో తేదీన ఓసారి స్టోర్ తెరిచి నాణేలు ప్రదర్శించాం. మళ్ళీ పదమూడున అరబ్ అతిధులకి తెరిచాం."

కిరణ్ ముఖం వికసించింది.

"పదో తేదీన సందర్శించిన అతిధులెవరు?"

"అరబ్‌నించి వచ్చిన ఫరూక్ అలీ అనే పెద్ద వాణిజ్యవేత్త. న్యూయార్క్‌నించి వచ్చిన జాన్సన్ అనే ప్రముఖ పారిశ్రామికవేత్త. మా డైరెక్టరునించి పర్మిషన్ లెటర్ తెచ్చాక క్యూరేటర్‌గారు స్వయంగా

వారికి నాణేలు చూపించారు."

కిరణ్ వాళ్ళ పేర్లు నోట్ చేసుకున్నాడు.

"మీకు పేర్లు దేశాలతో బాటు రెండు నెలల క్రిందట విజిటర్స్ ఎలా గుర్తున్నారు?"

"సాధారణంగా గుర్తుండరండి. కానీ ఫరూక్ అలీ అనే ఆ అరబ్ దేశసుడు ప్రత్యేకంగా ఈజిప్టు నాణెం గురించి చాలా వివరాలు అడిగాడండి. అది ఎవరు ఎప్పుడు మన దేశానికి బహూకరించారని అడిగాడు. దాని విలువ కూడా అడిగాడు. అది అమూల్యమని మేం చెప్పాం. జాన్సన్ అనబడే వ్యక్తి కూడా ఆ నాణెం గురించి వివరాలడిగాడు. తర్వాత అతను మా స్టాఫ్‌కి కృతజ్ఞత పూర్వకంగా చిన్న అల్పాహారవిందు ఇచ్చాడు. అందుకని వాళ్ళిద్దరు మాకు బాగా గుర్తున్నారు."

"మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. వాళ్ళిద్దరి ఫోటోలు లభిస్తాయా?"

"ఫోటోలు లేవండి. 'ఫారినర్స్ రిమార్క్స్' కోసమని మేము ప్రత్యేకం ఓ పుస్తకం మెయిన్‌టెయిన్ చేస్తాం. దాంట్లో వాళ్ళిద్దరు రిమార్క్స్ రాసి సంతకాలు పెట్టారు చూస్తారా?"

"మీ అనుమతితో!" అన్నాడు కిరణ్.

ఇన్‌ఛార్జి విజిటర్స్ బుక్ కిరణ్‌కి అందించాడు.

మ్యూజియంని . చూసి చాలా సంతోషించినట్టు ఫరూక్ అలీ రాశాడు. ఆసియాలోకెల్ల చక్కటి అమూల్యమైన పురాతన వస్తు సంపదగల ఏకైక ప్రదర్శన శాలగా జాన్సన్ పేర్కొన్నాడు.

ఇద్దరు ఆంగ్లంలోనే సంతకాలు చేశారు.

కిరణ్ మస్తిష్కంలో ఏదో మెరిసింది.

"ఆ ఇద్దర్లో ఎవరైనా ఛెయిన్ స్మోకరున్నాడా?"

"ఆం.... జాన్సన్ ఛెయిన్ స్మోకర్? చాలా ఖరీదైన రాయల్ సైజు సిగిరెట్లు కాలుస్తాడు."

"బ్రాండ్ మీకు గుర్తుందా?"

"డంకన్స్. నాకో ప్యాక్ ఉచితంగా యిచ్చాడు కూడా."

"గుడ్. మరో చక్కటి 'క్లూ' ఇచ్చారు. థాంక్యూ వెరీమచ్!"

ఇన్ ఛార్జి ముఖం ఆనందంతో వెలిగింది.

"సులేమాన్ వ్యక్తిగతంగా ఎలాంటివాడు? డ్రింకింగ్ అలవాట్లున్నాయా? డబ్బు ఇబ్బందుల్లో వున్నట్టు ఎప్పుడయినా గమనించారా?"

"లేదు సార్. అతనికి మంచి చరిత్ర వుంది. తోటి వాచ్ మన్ లకు అతనే అప్పుడప్పుడు ఆర్థికంగా సహాయ పడటం నాకు తెలుసు. తాగుడు, స్త్రీ వ్యసనాలు లేవు. బ్రహ్మచారిగా ఎందుకుండిపోయాడో మాత్రం నాకు తెలీదు. అతనే చోరీ చేశాడంటే నాకూ నమ్మబుద్ధి కావటంలేదు. కాని ఎప్పుడు ఎవరికెలాంటి బుద్ధి పుడుతుందో చెప్పలేం కదా!"

"యు ఆర్ రైట్!"

మరోసారి ఇన్ ఛార్జికి ధన్యవాదాలు చెప్పి యిద్దరు బయటకి వచ్చారు.

"చూశావా, మైడియర్ ఇన్స్పెక్టర్! క్యూరేటర్ లేరని నీ పరిశోధన అసంపూర్తిగా వదిలేశావు. నేను దాదాపు కేసుకి అవసరమైన ఇన్ఫర్మేషన్ అంతా సేకరించాను. కేసుకి ఓ రూపం వచ్చింది" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

శ్రీనివాస్ మందహాసం చేసి, "నాకు కొంతవరకు అర్థమయింది. కాని పూర్తి రూపం రాలేదు" అన్నాడు.

"పద, అలా కాసేపు లాన్‌లో కూచుందాం" అన్నాడు కిరణ్ ఫౌంటెన్ వున్న లాన్‌లోకి దారితీస్తూ.

ఇద్దరు హైలు మ్యూజియంకి, జవహర్ బాలభవన్‌లోకి మధ్యనున్న ఫౌంటెన్‌కి దగ్గరగా చక్కటి పచ్చిక మీద కూచున్నారు. అక్కడికి సాయంకాలం నీరెండలో మంచి ముత్యంలా తెల్లగా మెరిసిపోతున్న బిర్లామందిర్ శిఖరం కనులపండువుగా కనిపిస్తోంది. అటుపక్క ఆర్కియాలాజికల్ మ్యూజియం, ఇటు పక్క జూబిలీ హిల్స్, దాని పక్కగా అసెంబ్లీ హాలు నిజాం నవాబు వైభవాన్ని గుర్తుకి తెస్తున్నాయి.

"సులేమాన్ నాణెం దొంగిలించలేదు!" అన్నాడు కిరణ్ కూర్చుంటూ.

శ్రీనివాస్ అదిరిపడ్డాడు.

కిరణ్ కోటు జేబునుండి బ్రౌన్ కలర్ కవరు తీశాడు. అది సులేమాన్ జేబులో దొరికిన కవరు.

"ఎస్. ఇదిగో యీ కవరు మీద అడ్రసు చూడు. చివర హైద్రాబాద్ అన్న అక్షరాలు మసకగా కనిపిస్తున్నాయి. పైన 'టు' అడ్రసులో రెండు ఇంగ్లీషు అక్షరాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి చూడు. మొదటి అక్షరం 'సి', చివరది 'ఆర్' అవునా? ...... అవి 'క్యూరేటర్' హోదాని సూచిస్తున్నాయి. కింది లైన్‌లో ఆర్కియాలజీ మ్యూజియం పేరు, ఆ దిగువ పబ్లిక్ గార్డెన్స్ అనీ రాసివుంటాడు. అంటే నాణెం ఎక్కడ దాచిందీ యీ కవర్లో కోడ్ రాసి క్యూరేటర్ పేర పోస్టు చెయ్యాలని అతని సంకల్పం. కాని అంతలోనే

అతన్ని హత్య చేశారు. నాణెం కోసమే అతని దుస్తుల్లో వెతికారుగాని, ఇన్నర్ పాకెట్‌లో భద్రంగా దాచిన యీ కవరు హంతకుడి దృష్టికి రాలేదు. సులేమాన్ నిర్దోషిత్వానికి ఇంతకంటే నిదర్శనం అక్కరలేదు!" అన్నాడు కిరణ్.

"అయితే యీ 'కోడ్' ఏమిటంటావు?" అడిగాడు శ్రీనివాస్.

కిరణ్ కవర్లోని కాగితం బయటికి తీస్తూ, క్రీగంట తమచుట్టుపట్ల గమనిస్తున్నాడు.

"దీన్ని 'డీకోడ్' చేశావా?"

"ఆఁ! బ్రెయిన్‌లో. పద, స్టేషనులో వివరంగా మాట్లాడుకుందాం. మన తదుపరి కర్తవ్యం—నాణెం స్వాధీనం చేసుకోవటం!" అంటూ లేచాడు కిరణ్.

శ్రీనివాస్ అతనితో జీపు వద్దకు నడిచాడు.

8

పోలీసు స్టేషన్‌లో కిరణ్ శ్రీనివాస్ కూచున్నారు.

"జంట నగరాల్లోని మశీదులని ఓసారి మనం సందర్శించాలి" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ విచిత్రంగా చూశాడు.

కిరణ్, సులేమాన్ ఉత్తరాన్ని పైకి తీశాడు.

కాగితాన్ని టేబిల్ మీద పరిచాడు.

"ఇదిగో యీ మశీదు బొమ్మ చూశావు కదా! శిధిలావస్థలో వున్నట్లు సూచించాడు. గోడలు పడిపోయినట్లు, చిందరవందరగా మొక్కలు పెరిగినట్లు గీశాడు కదా! అంటే చాలా పురాతనమైన మశీదు. మశీదుకి కుడిపక్క ఓ చెట్టు వుంది. దానికింద ఎనిమిది అంకె వేసివుంది. అంటే సిటీలో వున్న పాడుబడ్డ మశీదు పక్కనున్న ఓ

చెట్టుకింద నా జేన్ని సులేమాన్ పాతిపెట్టాడు. ఎనిమిది అంకె ఎనిమిది అడుగుల లోతుని సూచిస్తోంది. తొమ్మిది అంకె నా జేనికి సంకేతం! తొమ్మిదో శతాబ్దంనాటి ఈజిప్టు నాణెమని అర్థం. సులేమాన్ అవటానికి వాచ్‌మన్ అయినా బాగా తెలివైనవాడు. డొక్క శుద్ధి వున్న వాడు. అందుకే నాణెం కోసం తన ప్రాణాన్ని పణం పెట్టాడు."

శ్రీనివాస్ ఆశ్చర్యంగా చూశాడు కిరణ్ వంక.

ఇంతలో లలిత హడావిడిగా లోనికి వచ్చింది. ఇద్దరికీ విష్ చేసి హేండ్ బ్యాగ్ లోనించి ఓ కవరుతీసి శ్రీనివాస్‌కి అందించింది. అతను గబగబ కవర్లోంచి అరతావు సైజు కాగితాన్ని బయటకితీసి చదివాడు. కిరణ్‌కి అందించాడు. "కూచోండి" అన్నాడు లలితతో. ఆమె కూచుంది.

కిరణ్ ఉత్తరం చదివాడు.

"మైడియర్ లల్లీ,

నే నేమయిపోయానో అని కంగారు పడుతూండి వుంటావు. నేను ప్రస్తుతానికి క్షేమంగానే వున్నాను. అయితే ఆపదల విష వలయంలో చిక్కుకొని వున్నాను. నీకు చెప్పకుండా ఓ విషయం దాచాను. అది యిప్పుడు తెలియజేస్తున్నాను. మనం పబ్లిక్ గార్డెన్‌లో చూసిన కాయిన్ న్యూయార్క్ పురావస్తు ప్రదర్శనశాలనించి తస్కరింపబడింది. రహీం అనే మనిషి దాన్ని అక్కడ పాతిపెట్టాడు. అతనే నన్ను కాయిన్ గురించి మా ఇంటికొచ్చి బెదిరించాడు. అతనికి మరో పార్ట్‌నర్ వున్నాడు. అతని పేరు మనోహర్. వీళ్ళిద్దరు తోడు దొంగలు.

నన్ను బెదిరించి వెళ్ళిపోయాక రహీంని ఫాలో

అయ్యాను. వాళ్ళ రహస్య స్థావరం కనుక్కున్నాను. మనోహర్ అనే వాడివద్ద పదో శతాబ్దంనాటి ఈజిప్టు నాణెం వుండేది. రహస్యంగా విన్న, వాళ్ళ సంభాషణని బట్టి ఆ నాణెం కూడా ఎవడో కొట్టేశాడని అర్థమయింది. అంటే ఆ రోజు పబ్లిక్ గార్డెన్ లోని నాణెము, మనోహర్ దగ్గరుండాల్సిన నాణెము కూడా మరో వ్యక్తి కాజేశాడు.

నేను వాళ్ళిద్దర్నీ వెంబడించాను. వాళ్ళు శుక్రవారం నాడు అరబ్ నించి వచ్చే ఓ పార్టీని కలుసుకున్నారు. నేను వాళ్ళనే ఫాలో అవుతూ వచ్చాను. ఆ పార్టీ వాళ్ళు రహీం మనోహర్ లని కాయిన్స్ గురించి అడిగారు. వాళ్ళు త్వరలో అందిస్తామనీ, కాయిన్స్ గాని ఎవరైనా వాళ్ళకు అమ్మజూపితే తమకు వెంటనే తెలియజేయమనీ తమ వద్దనించి ఎవరో వాటిని కాజేశారనీ చెప్పారు. అరబ్ పార్టీ వాళ్ళు అలాగేనని అంగీకరించాక రహీం, మనోహర్ తిరిగి వెళ్ళిపోయారు. వాళ్ళ సంభాషణనిబట్టి మరో నాణెం సులేమాన్ అనే వ్యక్తి వద్ద వున్నట్టు ఆ మూడు నాణేలకు ఇరవై లక్షల రూపాయలు అరబ్ పార్టీ ఇవ్వజూపుతున్నట్లు తెలిసింది.

నేను అరబ్ పార్టీని ఫాలో అయ్యాను. వాళ్ళు హోటల్ జయా ఇంటర్నేషనల్ లో దిగారు. నేను రహస్యంగా వాళ్ళ ఉనికిని గమనిస్తూ వచ్చాను.

రహీం, మనోహర్ లు వెళ్ళిపోయిన తర్వాత ఆ సాయంత్రం మరో ఇద్దరు వ్యక్తులు అరబ్ పార్టీని కల్సుకోవటానికి హోటల్ లోకి వచ్చారు. నేను హోటల్ రూంబోయ్ వేషంలో వాళ్ళ రూంకి వెళ్ళాను, సర్వ్ చేసే నెపంతో. జయా హోటల్ మేనేజర్ నాకు తెలుసు. అందుకని యాజమాన్యం నాతో సహకరించారు. ఓ

స్మగ్లింగ్ కేసు విషయం ఇన్ఫర్మేషన్ కావలసి వచ్చిందని వాళ్ళతో చెప్పి ఒప్పించాను.

నేను వెళ్ళిపోయిన సమయానికి అరబ్ పార్టీని కలవటానికి వచ్చిన వాళ్ళిద్దరితో పార్టీ నాయకుడు నాణేల గురించి మాట్లాడుతున్నాడు. వాళ్ల మాటలనిబట్టి వాళ్ళిద్దరి పేర్లు జాన్సన్, ఫరూక్ అలీ అని తెలుసుకున్నాను. నాముందు వాళ్ళు నాణేల విషయం ప్రస్తావించటం ఆపేశారు. వాళ్ళకేం కావాలో అర్ధంచేసుకొని బయటికి వచ్చేశాను. కీ హోల్ లోనించి చూశాను.

రెండు నాణేలు—మనం గార్డెన్ లో చూసిన నాణెంలానే వున్నాయి—జాన్సన్ అరబ్ పార్టీకి చూపిస్తున్నాడు—మూడో నాణెం గురించి పార్టీ నాయకుడు అడుగుతున్నాడు. త్వరలో దాన్ని తెచ్చి ఇస్తామని ఫరూక్ అలీ వాగ్దానం చేస్తున్నాడు. మూడూ తీసుకొని రమ్మని నాయకుడు అన్నాడు. ఆ మూడు నాణేలు కలిస్తే వాళ్ళకు ఎలాగో కొన్ని కోట్లు కలిసొస్తాయట. తర్వాత జాన్సన్, అలీ వెళ్ళిపోయారు. నేను వాళ్ళ వెంట ఫాలో అవుతూ వాళ్ళ స్థావరం చూశాను.

ప్రస్తుతం నీకు వాళ్ళ స్థావరం దగ్గర్లో వున్న పోస్టాఫీసునించి ఈ లెటరు రాస్తున్నాను. జాన్సన్ నించి ఆ నాణేలు ఎలాగైనా సంపాదించి మన ప్రభుత్వానికి అప్పచెప్పాలనుకుంటున్నాను.

నాకు ఎడ్వెంచర్ అంటే ఇష్టమని నీకు తెలుసు. ఈ ఎడ్వెంచర్ ప్రాణాపాయమని నాకు తెలిసీ ఇందులో దిగుతున్నాను. నాణేల గురించి చాలా పెద్ద మొత్తంలో వ్యాపారం జరుగుతోంది. కొంతమంది యింటర్నేషనల్ స్మగ్లర్ల హస్తాలు ఇందులో వున్నాయి. వాళ్ళ ఉనికిని

తెలుసు కున్నాను. వాళ్ళని ప్రభుత్వానికి అప్పగించటం భారత పౌరుడిగా నా విధి, విధ్యుక్త ధర్మం. అందుకే యీ బృహత్కార్యంలో ప్రాణాలు పోయినా నేను లెక్క చెయ్యదలచుకోలేదు.

బతికుంటే మళ్ళీ నీకు ఉత్తరం రాస్తాను. లేదా విజయుడినై వచ్చి కలుస్తాను. అమ్మకు నా క్షేమ వార్త తెలియచెయ్యి. నే నీ విషయం పోలీసులకి తెలియ చెయ్యటంలేదు. ఎందుకంటే వాళ్ళు జోక్యం చేసుకుంటే యీ స్మగ్లర్స్ దొరక్కుండా తప్పించుకు పారిపోయే అవకాశముంది. అందుకని నేనే స్వయంగా యిందుకు పూనుకున్నాను.

ఉంటానిక, జాన్సన్ సంగతి తేల్చుకున్నాక బతికుంటే కలుద్దాం.

నీ

మోహన్."

ఉత్తరం చదివి శ్రీనివాస్‌కి అందించాడు కిరణ్.

"మోహన్ చాలా ఉపయోగకరమైన ఇన్ఫర్మేషన్ పంపించాడు. థాంక్స్ మిస్ లలితా మీరు కూడా సివిల్ సెన్స్‌తో వెంటనే ఈ లెటరు మాకు అందచేశారు. మోహన్‌కే ఆపదా రాకుండా మేం చూస్తాం. అతడు మన అందరం గర్వించదగ్గ పనిచేస్తున్నాడు. అతని ప్రయత్నాన్ని మేము విజయవంతం చేస్తాం. ఈ కేసు ఓ ఇంటర్నేషనల్ స్మగ్లింగ్‌కి సంబంధించినది. త్వరలోనే ఆ గ్యాంగ్‌ని పట్టుకుంటాం. యింతకీ మోహన్ తను ఎక్కడనించి రాశాడో అదీ రాయలేదు, జాన్సన్ వాళ్ళ అడ్రస్ గాని, రహీం వాళ్ళ అడ్రస్ గాని యిందులో రాయలేదు__"

అని ఏదో గుర్తుచ్చి శ్రీనివాస్‌నించి ఆ కవరు తీసుకొని పోస్టల్ ముద్ర చూశాడు.

గోల్కొండనించి పోస్టు అయింది ఉత్తరం.

కిరణ్ ముఖం వికసించింది.

"బహుశా ఇది జాన్సన్ సొంతరానికి దగ్గర్లో వుందన్న మాట! సరే, కొంతవరకు ముందుకు సాగటానికి ఈ లెటరు చాలా ఉపయోగపడుతుంది.... మిస్టర్ శ్రీనివాస్! మనం మోహన్ విషయం గవర్నమెంటుకి రికమండ్ చెయ్యాలి. వీలయితే యిన్వెస్టిగేషన్ బ్యూరోలో అతన్ని అపాయింట్ చెయ్యమని చెప్పాలి" అన్నాడు కిరణ్.

"ష్యూర్, ష్యూర్" అన్నాడు శ్రీనివాస్.

లలిత ముఖం వికసించింది.

"చాలా థాంక్స్ సర్" అన్నది కృతజ్ఞతగా.

"మీరు వెళ్ళిరండి. ఇక మేము మోహన్‌కి సాయంగా వెళ్తాం. వీలయినంత త్వరలో అతన్ని మీకు అప్పగిస్తాం."

లలిత సెలవు తీసుకొని వెళ్ళిపోయింది.

"తెల్లవారగానే మనం గోల్కొండ వెళ్దాం. తర్వాత సులేమాన్ నాణెం దాచిన మసీదుకి వెళ్దాం. సులేమాన్ సూచించిన పాత మసీదులాంటివి సిటీలో ఎక్కడెక్కడున్నాయో వివరాలు రహస్యంగా సేకరించాలి. అది నీకే వదిలేస్తున్నాను. మనం మసీదు గురించి ఎంక్వయిరీ చేస్తున్నట్టు ఎంతమాత్రం బయటికి రాకూడదు" హెచ్చరించి బయటకి వచ్చేశాడు కిరణ్.

అంతలోనే ఏదో గుర్తువచ్చి మళ్ళీలోనికి వచ్చాడు. కోటుజేబులో నుండి సులేమాన్ కవరు శ్రీనివాస్‌కి

అందించి, "దీన్ని భద్రంగా సేఫ్‌లో దాచు. చాలా భద్రంగా, దీని నకలు నా బ్రెయిన్‌లో రికార్డయి పోయింది. దీన్ని కేసు పూర్తయే వరకు బయటకి తియ్యకు" అన్నాడు.

శ్రీనివాస్ దాన్ని జాగ్రత్తగా సేఫ్‌లో దాచాడు.

9

హోటల్ రూం తలుపు తియ్యబోతూ ఓ క్షణం ఆగాడు కిరణ్.

కీహోల్‌లోనించి చూశాడు. గదంతా చిందరవందరగా వుంది. ఉలిక్కిపడ్డాడు. అయితే ఆ ప్లాన్ కాగితం కోసం వేట మొదలయిందన్నమాట! తన రూం కూడా శత్రువులకి తెలిసింది.

తాళంతీసి తలుపు తోస్తూనే, తనమీదకి దాడి చెయ్య బోయిన ఇద్దరు వ్యక్తుల్ని ఒకడ్ని గడ్డంకింద పూని గుద్దాడు కిరణ్. ఒకడ్ని తలుపుతో కొట్టాడు.

వాళ్ళిద్దరు వెల్లకిల పడిపోయారు. కిరణ్ కోటుజేబు నించి రివాల్వర్ పైకి తీసి గురిపెట్టేంతలో ఒకడు పారి పోయాడు.

రివాల్వర్ రెండోవాడికి గురిచేసి "కదలకు జాన్సన్! నీ పార్టనర్ ఫరూక్ పారిపోయినా మాకు చిక్కక తప్పదు. వెర్రి వేషాలువేసి ప్రాణాలు పోగొట్టుకోకు" గర్జించాడు కిరణ్.

జాన్సన్ జేబులో చెయ్యిపెట్టబోయిన వాడల్లా ఆ ప్రయత్నం విరమించుకుని చేతులు పైకెత్తాడు.

కిరణ్ తలుపు మూసి, లాక్ చేశాడు. డ్రాయరు సొరుగులాగి పొడవాటి నైలాన్ తాడు పైకి తీశాడు. కాని ఇంతలోనే జాన్సన్ మెరుపు దాడిచేశాడు. కిరణ్

చేతిలోని రివాల్వర్ ఎగిరి అవతల పడింది.

రాబోయే ప్రమాదాన్ని గ్రహించిన కిరణ్ పక్కకి గంతేశాడు.

కింద కార్పెట్ లాగేశాడు జాన్సన్.

కిరణ్ ఆకలిగొన్న సింహంలా జాన్సన్ మీదికి లంఘించి, అతని తల చిక్కించుకొని రెండు చేతులమధ్య వెనక్కి విరిచాడు.

జాన్సన్ మెడ నరాలు పటపటమన్నాయి. నిస్సహాయంగా తల వాల్చేశాడు.

కిరణ్ తాడుతో జాన్సన్ కాళ్ళుచేతులు కట్టేసి కుర్చీకి కట్టేశాడు.

ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్‌కి ఫోన్ చేశాడు.

"జాన్సన్! సులేమాన్‌ని ఎందుకు హత్య చేశావు?" సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అన్నాడు కిరణ్.

"నా దారికి అడ్డు వచ్చాడు. నేను సంపాదించుకున్న నాణెం చేజిక్కించుకొని పారిపోయాడు. ఆ నాణెం విలువ ఇరవై లక్షలు. దాన్ని ఎక్కడో దాచేశాడు. దానికోసమే వాణ్ని చంపేశాను. కాని నాణెం దొరక లేదు. సాయంత్రం గార్డెన్‌లో నీ దగ్గిర ప్లాన్ కాగితం ఏదో చూశాను. అది సులేమాన్ నాణెం దాచిన ప్లాన్ అని గ్రహించాను. ఫరూక్‌తో ఇక్కడికొచ్చాను" అన్నాడు జాన్సన్.

"మీ స్థావరానికి మనిషి ఒకడు వచ్చాడు. అతన్ని ఏం చేశారు?"

"ఏం చెయ్యలేదు. మా దగ్గర నాణేలు తస్కరించుకు పోవాలని చూశాడు. ఫరూక్ షూట్ చేశాడు. కాలికి దెబ్బ తగిలింది. అతన్ని మా దగ్గరే బంధించాం. ఎంత

హింసించినా తనెవరో చెప్పలేదు. సి.బి.ఐ. ఏజెంటు అయివుంటాడని ప్రాణాలు తియ్యకుండా బంధించాం."

"నాణేలు ఎక్కడున్నాయి?"

"ఫరూక్ దగ్గర. అతనే ఇప్పుడు తప్పించుకు పారి పోయాడు.

"న్యూయార్క్ మ్యూజియంనించి నాణెం దొంగిలించినది ఎవరు?"

"రహీం అని నేను నియమించిన మనిషి. నాణెం ఇండియా తెచ్చి దాచేసి, ఎక్కడో పోయిందని అబద్ధమాడేడు—వాడు దాన్ని పబ్లిక్ గార్డెన్‌లో ఓ చోట పాతిపెట్టడం నేను గుర్తించాను. వాడికి తెలీకుండా దాన్ని నేను తవ్వి తెచ్చేశాను."

"మరి బ్రిటన్ నాణెం....?"

"దాన్ని మనోహర్ అని మరో ఏజెంట్ తెచ్చాడు. వాడు, రహీం లాలూచీ పడ్డారు. వాళ్ళని పోషించిన మమ్మల్నే మోసంచెయ్యాలనే చూశాడు. అందుకే నేను మనోహర్ ఫ్లేన్‌లో బిగించిన బ్రిటన్ నాణెం కూడా తెచ్చేశాను."

"వాళ్ళిద్దరు ఎక్కడున్నారు?"

"పరలోకంలో. మా సావరంమీద దాడిచేశారు. నేనే చంపేసి సులేమాన్ లాగానే సాగర్‌లో పారేశాను. ఈపాటికి శవాలు తేలి వుంటాయి."

"ఇంతకీ మీ స్థావరం ఎక్కడ?"

అంతలో తలుపు దగ్గర ఏదో చప్పుడైంది. కిరణ్ చటుక్కున పక్కకు తప్పుకున్నాడు.

జాన్సన్ నోరు తెరిచేంతలో 'సంయిన' గుండు వచ్చి అతని తలలోనించి దూరిపోయింది.

కిరణ్ నిర్ఘాంతపోయాడు. గ్లాస్ విండో వంక పరుగెత్తాడు. బాల్కనీలోనించి పరుగెత్తుతున్న వ్యక్తి కాలికి గురిచూసి కాల్చాడు. అతను అమాంతం విరుచుకు పడిపోయాడు.

కిరణ్ ఒక్క అంగలో అతన్ని సమీపించాడు.

ఆ వ్యక్తి మెరుపులా లేచి కిరణ్‌ని కాల్చబోయాడు.

అతని చేతికి గురిచూసి కాల్చాడు కిరణ్. రివాల్వర్ వదిలేసి బాధగా చెయ్యి పట్టుకున్నాడు ఆ వ్యక్తి.

అంతలో ఇన్స్పెక్టరు శ్రీనివాస్ బలగంతో వచ్చాడు.

"మిష్టర్ శ్రీనివాస్! జాన్సన్ చచ్చిపోయాడు. మనం వెంటనే గోల్కొండలోని ఫరూక్ అలీ నివాసానికి వెళ్ళాలి. దారి ఫరూక్ చూపిస్తాడు. అక్కడ మోహన్ క్షేమంగానే వున్నాడుగాని చాలా దీనావస్థలో వుండి వుంటాడు. ముందు అతన్ని విడిపించాలి. తర్వాత నాణెం విషయం...." అన్నాడు కిరణ్.

ఫరూక్ అలీ చేతికి కఫ్స్ బిగించాడు శ్రీనివాస్. అతడి దగ్గరున్న రెండు నాణేలను స్వాధీనం చేసుకున్నాడు.

10

సికింద్రాబాద్‌లోని మారేడిపల్లి రోడ్‌న వుంది సులేమాన్ సూచించిన పాడుబడ్డ మసీదు.

అక్కడ ఆగింది పోలీసు వాను.

కిరణ్ సూచన ప్రకారం మసీదుకి కుడిపక్కనున్న మర్రిచెట్టుకింద తవ్వకం కొనసాగింది.

సరిగ్గా ఎనిమిది అడుగుల లోతున ఓ చెక్కపెట్టె కనిపించింది. పైకి తీశారు.

పెట్టె తెరిచాడు శ్రీనివాస్. లోపల నాణెం, దానితో ఓ చీటీ వుంది.

చీటీలో — జాన్సన్ అనబడే విదేశీ యాత్రికుడు నాణెం మ్యూజియంనించి తస్కరించి పోతుండగా తాను పసిగట్టి వెంటాడి నాణేన్ని చేజిక్కించుకున్నట్టు, దాన్ని తిరిగి మ్యూజియంకి అందచేసేలోపల తనకేదైనా ప్రాణాపాయం కలగలచ్చునన్నే అనుమానంతో నాణేన్ని ఇక్కడ భద్రపరుస్తూన్నట్టు, నాణెం భద్రపరిచిన స్థలాన్ని తాను సాంకేతంగా ఓ ఉత్తరంలో సూచించి పంపుతున్నట్టు క్యూరేటర్ పేర సులేమాన్ రాశాడు.

"సులేమాన్ గొప్ప దేశభక్తుడు. ప్రభుత్వోద్యోగులకు ఆదర్శప్రాయుడు" అన్నాడు కిరణ్. "అతని ఆత్మకు భగవంతుడు శాంతి కలగజెయ్యాలి!"

శ్రీనివాస్ హేట్ తీసి, తనూ దేవుడ్ని స్మరించాడు.

"ఇక మోహన్ గారికి మీ డిపార్టుమెంటులో స్థానం కల్పించాలి". అన్నాడు కిరణ్ పక్కనే వున్న మోహన్ ని చూస్తూ శ్రీనివాస్ తో.

మోహన్ కృతజ్ఞతగా నవ్వాడు. అతని ముఖం పీక్కుపోయివుంది. గడ్డం బాగా పెరిగిపోయింది.

"మిష్టర్ శ్రీనివాస్. నీ కోసం సాగర్ లో మరో రెండు శవాలు సిద్ధంగా వున్నాయి. వెళ్ళి వాటి పని చూడు" అన్నాడు కిరణ్.

"ఏం చేస్తాం బ్రదర్, మా డ్యూటీయే అంత!" అన్నాడు శ్రీనివాస్ కిరణ్ వంక నవ్వుతూ చూస్తూ.

—:ఐ పో యిం ది:—